క్లుప్తంగా

పశువులకు దొమ్మ వ్యాధి నిరోధక టీకాలు



ఆవు దూడకు వ్యాక్సిన్ వేస్తున్న పశు సంవర్ధక సహాయకురాలు నిల్లా కోట సత్యశ్రీ

యలమంచిలి: గ్రామాల్లో పశువులకు దొమ్మ వ్యాధి నిరోధక టీకాలు ముమ్మరంగా వేస్తున్నట్లు మండల పశు వైద్యాధికారి డాక్టర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి చెప్పారు. శిరగాలపల్లి, బూరుగుపల్లి గ్రామాలలో మంగళవారం పశువులకు దొమ్మ వ్యాధి నిరోధక టీకా, గొర్రెలకు చిటుక వ్యాధి నిరోధక ఎంటరో టాక్సీమియా (ఈటీ) వ్యాక్సిన్ వేసినట్లు ఆయన వివరించారు. ఇంత వరకు 1200 పశువులకు, 900 గొర్రెలకు ఈ రెండు రకాల టీకాలు వేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం అడవిపాలెం, గుంపర్రు, కాంభొట్లపాలెం, ఇలపకుర్రు, అబ్బిరాజుపాలెం, బాడవ గ్రామాల పశు సంవర్ధక సహాయకుల సహాయంతో చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరం



వేసవి విజ్ఞాన తరగతుల్లో శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులు

నరసాపురం: నరసాపురం గ్రేడ్-1 శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో మంగళవారం పిల్లలకు నీతి కథలు చెప్పారు. అలాగే పిల్లలతో తెలుగు చదివించారు. తెలుగు టు ఇంగ్లీష్ ట్రాన్స్‌లేషన్, యోగా, చెస్ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ వేసవి విజ్ఞాన తరగతులకు మంచి స్పందన వచ్చిందని, శుక్రవారంతో శిక్షణ శిబిరం ముగుస్తుందని లైబ్రేరియన్ కేజేఎస్ఎల్ కుమారి చెప్పారు.

పర్యావరణ పరిరక్షణే ధ్యేయం

భీమవరం: పర్యావరణ పరిరక్షణ అందరి ధ్యేయమని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని సర్వశిక్ష అభియాన్ కమ్యూనిటీ మొబైల్ లైజింగ్ ఆఫీసర్ యండమూరి చంద్రశేఖర్ అన్నారు. భీమవరం పట్టణంలోని పొట్టి శ్రీరాములు మునిపల్ గరల్స్ హైస్కూల్లో శ్రీ విజ్ఞాన వేదిక, సర్వశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు పోటీలను నిర్వహించారు. శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు.

ఆ మూడింట... కూటమిదే విజయం



నరసాపురం ఆర్ఓ నుంచి ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న నాయకర్



ఆర్ఓ నుంచి ధ్రువీకరణపత్రం అందుకుంటున్న నిమ్మల రామానాయుడు



ఆర్ఓ నుంచి ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న పితాని

పెనుగొండ: ఆచంట నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి పితాని సత్యనారాయణ విజయం సాధించారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థి చెరుకువాడ శ్రీరంగనాథరాజుపై 26,076 ఓట్లు మెజార్టీతో విజయం సాధించారు. మంగళవారం భీమవరంలో జరిగిన ఓట్ల లెక్కింపు 14 రౌండ్లలోనూ పితాని ఆధిపత్యం కనబరిచారు. పితాని సత్యనారాయణ 84,429 ఓట్లు సాధించగా, చెరుకువాడ శ్రీరంగనాథరాజు 58,353 ఓట్లు సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థి నెక్కంటి వెంకట సత్యనారాయణ 1859 ఓట్లు సాధించగా, బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థి అలూరి చిన్నారావు 1536 ఓట్లు, స్వతంత్ర అభ్యర్థి సికిలే రత్నరాజు 293 ఓట్లు, జాతీయ చేతి వృత్తుల ఐక్య వేదిక పార్టీ అభ్యర్థి 275 ఓట్లు, జైభారత్ నేషనల్ పార్టీ అభ్యర్థి వెలగల శ్రీనివాస రెడ్డి 267 ఓట్లు, జైబీమ్ రావు భారత్ పార్టీ అభ్యర్థి 215 ఓట్లు, స్వతంత్ర అభ్యర్థి రామోజు పూర్ణ చంద్ర శేఖర్ 150 ఓట్లు సాధించగా, నోటాకు 1661 ఓట్లు వచ్చాయి.

ఆచంట నుంచి పితాని మూడోసారి విజయం

ఆచంట నియోజకవర్గం నుంచి పితాని సత్యనారాయణ మూడోసారి విజయం సాధించారు. పెనుగొండ నుంచి ఒక సారి విజయం సాధించిన పితాని, నియోజకవర్గాల పునర్విభజన అనంతరం ఆచంట నియోజక వర్గం నుంచి 2009లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి మంత్రి పదవి సాధించారు. అనంతరం 2014లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా విజయం సాధించి, 2019లో చెరుకువాడ శ్రీరంగనాథరాజు చేతిలో 12886 ఓట్లుతో తేడాతో ఓటమి చెందారు. తిరిగి ప్రస్తుతం 26076 ఓట్లు తేడాతో విజయం సాధించారు.

హ్యాట్రిక్ సాధించిన ఎమ్మెల్యే నిమ్మల

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు మూడో సారి విజయం సాధించి హ్యాట్రిక్ సాధించారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)పై 67,881 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. మంగళవారం భీమవరం విష్ణు కళాశాలలో జరిగిన ఓట్ల లెక్కింపు అనంతరం ఆర్వో నారాయణరెడ్డి నుంచి రామానాయుడు గెలుపొందినట్లు ధ్రువీకరణ పత్రం అందుకున్నారు.

నరసాపురంలో గెలుపొందిన నాయకర్

నరసాపురం రూరల్: నరసాపురం అసెంబ్లీ స్థానం నుంచి కూటమి అభ్యర్థిగా జనసేన పార్టీ నుంచి బరిలో నిలిచిన బొమ్మిడి నాయకర్ 49,762 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఆయన తొలిసారిగా ఎమ్మెల్యే అసెంబ్లీలో అడుగుపెట్టనున్నారు. గత ఎన్నికల్లో ఓటమి చవిచూసిన ఆయన ఈ సారి గెలుపొందడంతో జనసేన శ్రేణుల్లో జోష్ నెలకొంది.

చెక్కుచెదరని అభిమానం

ఆకివీడు: మండలంలోని కొల్లేరు తీరంలోని చినమిల్లిపాడు, రాజులపేట గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ అభిమానం చెక్కుచెదరలేదు. గ్రామస్తులు ఇచ్చిన మాట ప్రకారం వైఎస్సార్‌సీపీకి మెజార్టీ చేకూర్చారు. కూటమి గాలిలో కూడా ఆ రెండు గ్రామాల ప్రజలు అభిమానంతో 450, 10 ఓట్లు మెజార్టీ కలిగించారు. గత ఎన్నికల్లో కూడా ఆయా గ్రామాలు మెజార్టీ చేకూర్చాయి. ప్రస్తుత ఎన్నికల్లో 938 ఓట్లు చినమిల్లిపాడులో పోలవ్వగా వైఎస్సార్‌సీపీకి 672 ఓట్లు వేశారు. రాజులపేటలో 447 ఓట్లు పోలవ్వగా వైఎస్సార్‌సీపీకి 210 ఓట్లు వచ్చాయి.

వైభవంగా మహానంది అభిషేకం



మాదివాడలోని మల్లేశ్వరస్వామి ఆలయంలో మహానందికి అభిషేకం చేస్తున్న దృశ్యం

ఆకివీడు: మహానందికి అభిషేకాలు మంగళవారం వైభవోపేతంగా నిర్వహించారు. స్థానిక మాదివాడలోని మల్లేశ్వరస్వామి ఆలయంలోనూ, జవహర్‌పేటలోని రాజరాజేశ్వరి సహిత మార్కండేయేశ్వర స్వామి ఆలయంలో నందికి అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా వివిధ పండ్ల రసాలు, ఆవుపాలు, పెరుగు, నెయ్యి, పసుపు, కుంకుమ, కొబ్బరి నీళ్లతో అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకులు లంక దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక అలంకరణ చేశారు. మార్కండేయేశ్వరస్వామి ఆలయంలో ఆలయ కార్యదర్శి కాకర్ల రాజరాజేశ్వరి ఆధ్వర్యంలో అభిషేకాలు చేశారు. వైశాఖ మాసం బహుళ త్రయోదశి రోజు నందీశ్వరుడికి అత్యంత ప్రీతిపాత్రమైన రోజని, అమావాస్య ముందు రోజు వచ్చే త్రయోదశికి అభిషేకాలు చేస్తే పాపాలు హరించి, పుణ్యం లభిస్తుందని పురాణాలు చెబుతున్నట్లు దుర్గాప్రసాద్ వివరించారు. భక్తులు స్వయంగా అభిషేకంలో పాల్గొన్నారు.

సుందరంగా ఆర్వోబీ, డివైడర్స్

- రంగులతో ముస్తాబు
- మొక్కలతో పచ్చదనం



తణుకు రాష్ట్రపతి రోడ్డులో రంగులతో సుందరంగా తీర్చిదిద్దిన డివైడర్స్

తణుకు అర్బన్: తణుకు రాష్ట్రపతి రోడ్డులోని ఆర్వోబీ, డివైడర్స్ సుందరంగా తీర్చిదిద్దారు. అభివృద్ధి పనుల్లో భాగంగా మునిసిపల్ నిధులతో ఆర్వోబీని, డివైడర్స్ రంగులతో తీర్చిదిద్దడమే కాకుండా ఆర్వోబీపై మొక్కల కుండీలు ఏర్పాటు చేసి మొక్కలు వేయగా, డివైడర్స్‌లో సైతం ఆహ్లాదాన్ని పంచే మొక్కలు వేయడంతో ప్రయాణికులకు కనువిందు చేస్తున్నాయి. తణుకు ప్రధాన రహదారి అయిన రాష్ట్రపతి రోడ్డుపై నిత్యం పట్టణానికి చెందిన వారే కాకుండా తణుకు చుట్టుపక్కల 100 గ్రామాల నుంచి వివిధ వ్యాపార, ఉద్యోగాల నిమిత్తం లక్షలాది మంది ప్రయాణాలు చేస్తుంటారు. గతంలో నిర్వీర్యంగా ఉండే ఆర్వోబీ, డివైడర్స్‌ను సుందరంగా తయారు చేయడంతో ప్రయాణికులు సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం మునిసిపల్ సిబ్బంది మొక్కలను సంరక్షించడమే కాకుండా ట్యాంకు ద్వారా నీరు పోస్తున్నారు.

బడి తెరిచిన రోజే విద్యాసామగ్రి

పెనుగొండ: నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ ఏర్పడింది. దీనికి తోడు గతానికి భిన్నంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పాఠశాలల వేసవి సెలవులు ముగిసి పునః ప్రారంభానికి ముందే జేవీకే కిట్లు సిద్ధం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలల విద్యార్థులకు దీటుగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం మండలంలోని అన్ని పాఠశాలలకు జేవీకే కిట్లు సమకూర్చారు. తొలి విడతగా 1014 మంది చిన్నారులకు షూలు, షాక్స్, 2429 మందికి బెల్ట్‌లు, పాఠ్య పుస్తకాలు 20531, సిద్ధం చేశారు. దీంతో పాటు విద్యార్థులకు ప్రాక్టికల్ పుస్తకాలు, ఆక్స్‌ఫర్డ్ నిఘంటువులు, యూనిఫాంలు అందించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. రెండో దశలో విద్యార్థులకు వీటిని సమకూర్చడానికి పాఠశాలలు తెరిచిన రోజే అందించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.



వడలి పాఠశాలలో యూనిఫాంలో విద్యార్థులు(ఫైల్)

చేరికలు పెంచేందుకు విస్తృత ప్రచారం

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను అధిక సంఖ్యలో చేర్పించడానికి ప్రభుత్వ ఉపాధ్యాయులు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ఫ్లెక్సీలు వ్రేలాడదీయడం, సోషల్ మీడియాలో ప్రచారం చేయడం ద్వారా విద్యార్థుల సంఖ్యల పెంచుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఎప్రభుత్వ పాఠశాలలు మా ప్రత్యేకతలు ఇవే అంటూ ప్రచారం చేసుకునే స్థాయికి చేరుకొన్నాయి. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు గత విద్యా సంవత్సరంలో సాధించిన మార్కులు ప్రకటించడంతో పాటు, ఫీజులు భారం లేని ఉచిత విద్య, ఉచిత పాఠ్యపుస్తకాలు, ఉచిత మెటీరియల్, మధ్యాహ్నం రుచికరమైన భోజన సదుపాయం, ఇతర ప్రభుత్వ రాయితీలు, వసతులు, కార్పొరేటుకు ధీటుగా మౌలిక సదుపాయాలు అంటూ విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా కార్పొరేట్ పాఠశాలలకు పోటీగా ప్రచారం చేస్తూ విద్యార్థులను ఆకర్షించడానికి ప్రయత్నిస్తున్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

తాడేపల్లిగూడెం (టీటీసీ): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా సబ్ యూనిట్ హెల్త్ అధికారి వై.వి.లక్ష్మణ రావు అన్నారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవాలలో భాగంగా అవగాహన కార్యక్రమం, ర్యాలీ మంగళవారం యాగర్లపల్లి పట్టణ ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ తనూజ అధ్యక్షతన నిర్వహించారు. వీకర్స్‌కాలనీ, బేబి సెంటర్, కడకట్ల పరిధిలోని వైద్యాధికారులు డాక్టర్.శ్రావ్య, డాక్టర్ అనీషా, ఆశాలు, వార్డు ఆరోగ్య కార్యదర్శులు హాజరైయారు. లక్ష్మణరావు మాట్లాడుతూ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. మలేరియా ఆడ ఎనాఫిలిస్ దోమ కుట్టడం వల్ల వ్యాధి వ్యాప్తి చెందుతుందని తెలిపారు. ఎక్కువకాలం నీటి నిల్వ ఉన్న ప్రదేశాలలో సంతానోత్పత్తి చేస్తుందని, సంక్రమణ వ్యాధులలో అతి ముఖ్యమైనదని చెప్పారు. వ్యాధులు వ్యాప్తి చెందుకుండా ఉండేందుకు నియంత్రన చర్యలు ఫాగింగ్, స్ప్రేయింగ్, లార్వా జనిత ప్రదేశాలలో గుంబుషియ ఫిష్ రిలీజ్ చేయాలని పలు సూచనలు చేశారు.

వేసవి శిక్షణ శిబిరంతో సృజనాత్మక శక్తి

ఆకివీడు: వేసవి శిక్షణ కార్యక్రమాలు విద్యార్థులలో ఉత్సాహాన్ని, ఆలోచనా శక్తితో పాటు సృజనాత్మకత పెంపొందిస్తాయని గ్రంథాలయ పాలకురాలు పార్వతి అన్నారు. స్థానిక మాదివాడ శాఖా గ్రంథాలయంలో నెల రోజులుగా వేసవి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం క్రికెట్, పేపర్ పువ్వుల తయారీలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థుల మేధస్సుకు పదును పెట్టే విధంగా పలు అంశాలపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు, వక్తలు ఇచ్చిన తర్ఫీదులో విద్యార్థులు నూతన విషయాలు నేర్చుకున్నారన్నారు. వేసవి శిక్షణ విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని పెంపొందిస్తుందన్నారు. పఠనా శక్తిని వృద్ధి చేస్తుందన్నారు. గ్రంథాలయంలోని విలువైన పుస్తకాల్ని చదివితే విద్యార్థులకు ప్రముఖుల జీవిత చరిత్ర స్ఫూర్తి దాయకంగా నిలుస్తుందని తెలిపారు.

భీమవరంలో వేసవి శిక్షణ శిబిరం

భీమవరం: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞా న శిబిరంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు క్యార మ్స్ చెస్ క్రీడ ల్లో శిక్షణ ఇచ్చి పుస్తక పఠనం చేయించారు. అనంతరం రిసోర్స్ పర్సన్ జి.విజయ్‌కుమార్ గణిత పజిల్స్‌పై విద్యార్థులకు పోటీ నిర్వహించారు. ఈ పోటీల్లో షేక్ అబ్దుల్ లియాకత్ ప్రథమ స్థానంలోను, బి.భార్గవి ద్వితీయ స్థానంలో నిలిచి, నగదు బహుమతి అందుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎస్.వెంకటేశ్వరరావు, డ్యాన్స్ మాస్టర్ జి.శ్యామ్, జె.గంగాధర్, సోమరాజు, పుష్ప, వివివిఎస్.మూర్తి, తదితరులు పాల్గొన్నారు.



క్యారమ్స్, చెస్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

సిరి ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

- చిరుధాన్యాల సాగుపై ఆసక్తి చూపుతున్న రైతులు
- తక్కువ కాలంలో కోత .. నికరంగా లాభం
- నేడు మార్కెట్‌లో మిలెట్స్‌కు పెరుగుతున్న డిమాండ్



కొర్రల పంట



సామల పంట



అరికెల పంట

బుట్టాయగూడెం: నేడు వ్యవసాయం ఆధునికంగా మారింది. వాణిజ్య పంటల వైపు రైతులు పరుగులు తీస్తున్నారు. తద్వారా బలవర్ధకమైన ఆహార పంటలు కనుమరుగవుతున్నాయి. ఆరు, ఏడు దశాబ్దాల నాడు రైతులు ఎలాంటి ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడకుండా బలవర్ధకమైన చిరు ధాన్యాలను పండించే వారు. అయితే ఆ తర్వాత వాటి సాగు కాల క్రమేపీ కనుమరుగైంది. నేడు పంటలు పండించే విధానం వల్ల వివిధ రకాల వ్యాధులు, అంతుచిక్కని రోగాలతో ప్రజలు సతమతమవుతున్నారు. లక్షలాది రూపాయలు వైద్యం కోసం ఖర్చు చేస్తున్నారు. నేటి పరిస్థితులను పరిశీలిస్తే దేవుడి గుడిలో క్యూ కట్టే వారి కంటే ఆస్పత్రిలో క్యూకట్టే వారి సంఖ్య ఎక్కువగా కనిపిస్తుంది. వ్యాధుల నుంచి రక్షించుకోవడం కోసం ఆహారపు అలవాట్లలో మార్పులు అనివార్యంగా భావిస్తున్నారు. ఈ మేరకు నాటి పేద రైతులు పండించే కొర్రలు, అండుకొర్రలు, సామలు, ఊదలు, అరికలు వంటి పంటలు ఇప్పుడు మిల్లేట్లుగా, సిరి ధాన్యాలుగా ప్రాచుర్యం పొందుతున్నాయి. ప్రతికూల వాతావరణాన్ని తట్టుకుని ఎటువంటి పరిస్థితుల్లోనైనా స్థిరమైన దిగుబడి ఇవ్వడంతో పాటు అధిక పోషక విలువలు కలిగిఉన్నవే చిరుధాన్యాలు. చిరుధాన్యాల వినియోగంపై అన్ని వర్గాల ప్రజలు ఆసక్తి చూపడంతో తాజాగా వీటి సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు.

లాభాలు మెండు

చిరు ధాన్యాల సాగుతో లాభాలు మెండుగా ఉంటాయని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలో మారుమూల కొండ ప్రాంతంలో నివసించే ఆదివాసీలు ప్రధాన పంటలు జొన్నలు, రాగులు, చోళ్లు వంటి పంటలు పండించే వారు. అయితే మారుతున్న కాలంతో పాటు గిరిజనులు కూడా ఆహారపు అలవాట్లలో మార్పులు కోరుకున్నారు. ప్రస్తుత ఆరోగ్య సమస్యల కారణంగా వారు కూడా చిరుధాన్యాల సాగువైపు మళ్లీ దృష్టి సారించారు. సిరుల పంటలపై ప్రస్తుతం పెరిగిన డిమాండ్ కారణంగా మిలెట్స్ పేరు (న్యూట్రీ గ్రెయిన్స్)గా, సిరి ధాన్యాలుగా మారిపోయింది. కరువు కాలాల్లోనూ పండే సిరి ధాన్యాల పంటలు కొత్తగా ప్రవేశించడంతో ప్రజల్లో ఆరోగ్యదాయక ఆహారంపై శ్రద్ధ పెరగగా నాడు సిరి ధాన్యాలు పంటలు పండించిన పేద రైతులను నేడు మళ్లీ గుర్తుకు తెచ్చుకుంటున్నారు. ప్రకృతి వ్యవసాయ విధానంపై చిరుధాన్యాలైన కొర్రలు, అండుకొర్రలు, ఊదలు, సామలు, అరెకల పంట సాగు, వాటిలో పోషకాల లభ్యతను వ్యవసాయశాఖ అధికారులు వివరించారు. ఈ మేరకు పంటలకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

కొర్రలు

తేలికపాటి ఎర్ర చెల్క నేలల్లో ఎక్కువగా వర్షపాతం నమోదయ్యే ప్రాంతాల్లో పండించుకోవచ్చు. ఖరీఫ్ జూన్ రెండో వారం నుంచి జులై చివరి వారం వరకూ విత్తుకోవచ్చు. వరుసల మధ్య 30 సెంటీమీటర్లు, మొక్కల మధ్య 10 సెంటీమీటర్లు దూరం ఉండేలా నాటుకోవాలి. పంట కాలం 75 నుంచి 80 రోజులు. ఎకరానికి 6 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. చీడ, పీడలు చాలా తక్కువ. క్రిమికీటకాలు ఆశిస్తే సాధారణ పంటలకు పిచికారీ చేసిన మందులనే వాడితే సరిపోతుంది.

లాభాలు

కొర్రలు తీపి, వగరు రుచులు కలిగి ఉంటాయి. మధుమేహం వ్యాధిగ్రస్తులకు మంచి ఆహారం. శరీరంలో కొలెస్ట్రాల్ పరిమాణాన్ని తగ్గిస్తుంది.



కొర్రలతో తయారు చేసిన వంటకం

యాంటీ ఆక్సిడెంట్‌లు అధికంగా ఉంటాయి. కొర్రల్లో అధిక పీచుపదార్థం, మాంసకృతులు, కాల్షియం, ఐరన్, మాంగనీస్, మెగ్నీషియం, భాస్వరంతోపాటు విటమిన్లు అధిక పాళ్లలో ఉంటాయి. చిన్నపిల్లలు, గర్భిణిలకు మంచి ఆహారం . ఉదయ సంబంధిత వ్యాధులకు ఉపశమనం కలిగిస్తుంది.

సామలు

సామల పంట ఏ నేలలోనైనా పండుతుంది. అధిక ఉష్ణోగ్రత, నీటిని తట్టుకుంటుంది. జూన్ నుంచి జులై చివరివారం వరకూ ఈ పంటను విత్తుకోవచ్చు. సాళ్ల మధ్య 25 సెంటీమీటర్ల, మొక్క మధ్య 10 సెంటీమీటర్లు దూరం ఉండాలి. ఈ పంటకాలం 80 నుంచి 90 రోజులు. ఎకరాకు 5 నుంచి 6 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. సస్యరక్షణకు సాధారణ పంటల మాదిరిగానే పనులు చేపట్టాల్సి ఉంటుంది.

లాభాలు

సామల పంట తియ్యగా ఉంటాయి. వీటి ఆహారంగా తీసుకోవడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు పరిష్కరించబడతాయని వైద్యులు సూచిస్తున్నారు. పైత్యం ఎక్కువ అవ్వడం వల్ల భోజనం తర్వాత గుండెల్లో మంటగా ఉండడం, కడుపు ఉబ్బరంగా ఉండటం వంటి సమస్యలకు సామలు ఔషధంగా పనిచేస్తుంది. సుఖవ్యాధులు, అతిసారం, అజీర్ణం తగ్గిపోతుంది. పీచుపదార్థం మలబద్ధకాన్ని అరికడుతుంది. మైగ్రేన్ సమస్యను దూరం చేస్తుంది. గుండె సమస్యలు, ఊబకాయం, కీళ్ల నొప్పులకు సామల పంట బలవర్ధకమైన ఆహారం.

అరికెలు

ఈ పంట ఏ నేలలో అయినా పండుతుంది. నీటి ఎద్దడిని తట్టుకుంటుంది. పొడి వాతావరణం చాలా అనుకూలం. జూన్ నుంచి జులై నెలాఖరు వరకూ విత్తుకోవచ్చు. సాళ్ల మధ్య 25 సెంటీమీటర్లు, మొక్కల మధ్య 10 సెంటీమీటర్లు ఉండాలి. పంట కాలం 95 రోజుల నుంచి 100 రోజుల వరకూ ఉంటుంది. ఎకరానికి 6 నుంచి 8 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

లాభాలు

అరికెలు తీపి, వగరు, చేదు రుచులు కలిగి ఉంటాయి. అధిక పోషకాలు కలిగి ఉండటం వల్ల పిల్లలకు మంచి ఆహారంగా పని చేస్తుంది. విటమిన్లు, ఖనిజాలు అధికంగా ఉంటాయి. జీర్ణశక్తి పెరుగుతుంది. కేన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా నివారిస్తుంది. వీటిని పప్పు దినుసులైన బొబ్బర్లు, శనగలతో కలిపి తీసుకుంటే శరీరానికి కావాల్సిన పోషకాలు పుష్కలంగా లభిస్తాయి. వాతం, కీళ్లవాతానికి, కంటి, నరాల బలహీనతకు అరికెలు మంచి ఆహారం. అరికె పిండి వాపులకు పైపూతగా వాడతారు.



అంగన్‌వాడీ పిల్లలను పోషకాహారం అందిస్తున్న దృశ్యం



చిరు ధాన్యాలు

ఊదలు

ఈ పంట ఏ నెలలోనైనా పండుతుంది. వరికి ప్రత్యామ్నాయ పంట. సాళ్లకు సాళ్లకు మధ్య 25 సెంటీమీటర్లు, మొక్కల మధ్య 10 సెంటీమీటర్లు ఎడం ఉండాలి. పంట కాలం 90 నుంచి 95 రోజులు. దిగుబడి ఎకరాని 5 నుంచి 8 క్వింటాళ్ల వరకూ వస్తుంది. సస్యరక్షణ చర్యలు మామూలు పంట మాదిరిగానే చేసుకోవాలి.

లాభాలు

ఊదలు రుచికి తియ్యగా ఉంటాయి. ఊదలతో తయారు చేసిన ఆహారం బలవర్ధకంగా ఉంటుంది. సులభంగా జీర్ణమవుతుంది. ఉత్తర భారత దేశంలో ఉపవాస దీక్షలో ఎక్కువగా వినియోగిస్తారు. ఉత్తరాఖండ్, నేపాల్‌లో ఊదల ఆహారాన్ని గర్భిణులు, బాలింతలకు ఎక్కువగా ఇస్తారు. ఊదలు వ్యాధి నిరోధక శక్తిని పెంచుతాయి. చిన్నపేగుల్లో ఉండే పుండ్లు, పెద్ద పేగులకు వచ్చే కేన్సర్ బారిన పడకుండా ఇవి కాపాడతాయి.

అండు కొర్రలు

వీటిని ఏ నేలలోనైనా పండించవచ్చు. అతి తక్కువ వర్షపాతం ఉన్నా పంట చేతికి అందుతుంది. ఎకరానికి 5 నుంచి 6 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. సాళ్ల మధ్య 60 సెంటీమీటర్లు, మొక్కల మధ్య 10 సెంటీమీటర్లు దూరం ఉండాలి. ఒక్కో దుబ్బుకు 15 నుంచి 20 పిలకలకు వస్తాయి. పంటకాలం 85 రోజులు. సస్యరక్షణకు ఎరువుల వినియోగం మామూలుగా ఎర్రజొన్నలా వేస్తే సరిపోతుంది.

లాభాలు

సాంప్రదాయ పంటల్లో అండుకొర్రలు ఒకటి. అండుకొర్రలను నాలుగు గంటలు నానబెట్టిన తర్వాతే వండుకోవాలి. జీర్ణాశయం, ఆర్థరైటిస్, బీపీ, థైరాయిడ్ వంటి సమస్యలు, ఊబకాయ నివారణకు ఉపయోగపడతాయి. అల్సర్, కేన్సర్ చికిత్సకు బాగా ఉపయోగపడతాయి.

గర్భిణులకు చిరు ధాన్యాల ఆహారం

అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణులకు చిరు ధాన్యాలనే నేడు ఆహారంగా ఇస్తున్నారు. దీనివల్ల ఎంతో ప్రయోజనం ఉంటుందని మహిళలు చెప్పన్నారు. అలాగే బాల సంజీవని కార్యక్రమంలో గర్భవతులు, బాలింతలతో పాటు పిల్లలకు కూడా కొర్రలు, రాగి, జొన్నలు వంటి ఆహారాన్ని మెనూ ప్రకారం అందిస్తున్నారు.

చిరుధాన్యాల సాగును ప్రోత్సహిస్తున్నాం



చిరుధాన్యాల పంటలపై రైతులను ప్రోత్సహిస్తున్నాం. పంటల ప్రాముఖ్యతపై గ్రామాల్లో రైతులతో అవగాహన కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నాం. పాత తరంవారు వెంటనే పంటలు వేసేందుకు ముందుకు వస్తున్నారు. చిరుధాన్యాల పంటల సాగు పెరగాలంటే కొంత సమయం పడుతుంది. ఈ ఏడాది ఖరీఫ్‌లో కూడా చిరుధాన్యాల పంటలు వేసేలా ప్రోత్సహిస్తాం.

– డి.ముత్యాలరావు, ఏవో, బుట్టాయగూడెం